


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**94**

**(12` నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రకృతి కూడా మానవుల** మీదకు మాటిమాటికీ కసితో ఎదురు తిరుగుతోంది. మానవుడు ఎదురు తిరగడంలేదే? నేమాత్రం ఊరుకుంటానా - అన్నట్లు సవాళ్ళు చేస్తోంది.

సంసారాలు చూస్తే జాలిగాథలతో నిండిపోతున్నాయి. ఒక రోజు ఎలా గడుస్తున్నదో చెప్పడానికి వీలులేకుండా వుంది. ముప్పూటలా భోజనం వున్నా లేకపోయినా, గప్పాలు కొట్టుకు బ్రతుకుతున్నారు చాలామంది.

"ఏ పూటా కుండ నిండా బియ్యం పొయ్యలేదు. పొయ్యనిండా మంట పెట్టడం లేదు. నోట్లోకి నాలుగువ్రేళ్ళు పోవడం లేదు. సగానికి సగం బియ్యం రెండు చితుకులు పొయ్యిలో నాలుగంటే నాలుగు మెతుకులు నోట్లో" అన్నది మొన్న ఓ బీదరాలు. ఇలాటివారు ఎన్ని లక్షలమంది వున్నారో?

పరిస్థితులిలా వుండగా అనుకోని తుఫానులు వచ్చి పడుతుంటే  ఇక నరుడెలా తట్టుకోవడం. ఎలా బ్రతుకులు సరిపెట్టుకోవడం? మే నెలనుంచీ ఆంధ్రప్రాంతంలో నాలుగైదు తుఫానులా రాజకీయపు తుఫానులకంటే ఇవి ఎక్కువ అవుతున్నాయంటే ఎంత ఆశ్చర్యం.

ఏ తుఫానునూ మనం ఆపలేమనుకోండి. అది వేరే సంగతి. అయినా వాటి ప్రభావానికి తట్టుకోవాలిగదా. దానికి అవసరమైన బలాలు వున్నాయా. ఏమున్నా ఇదంతా విధివైపరీత్యం కాక ఏమవుతుంది?

విజయవాడలో ఇంత గాలి ఎప్పుడు ఎరగమన్నారు చాలామంది. వాయుదేవుడు నూరు నుంచి నూటాయాభై కిలోమీటర్ల వేగం సంపాదించుకుని, బయలుదేరితే ఏమి ఆగుతుంది. అంత వెర్రికోపం దేనికయ్యా బాబూ అంటే వింటాడా ఏమన్నానా?

దీపాలు లేక ఊరంతా కాటుక ముద్ద అయింది. అయినా తలుపులు తెరవడానికి వీలా ఏమన్నానా? చీకటిళ్ళల్లో జీవితాల్ని మూటగట్టి భగవంతునికి అప్పజెప్పి మిడిగ్రుడ్లు వేసుకుని కూర్చోవడం తప్ప చేసేదేంవుంది?

ఉన్న మైనపు వత్తి వెలుగుతో గడియారం వంక చూస్తే, చిన్నముల్లు మాట అలావుంచి, పెద్ద ముల్లు మాత్రం కదిలిందా!? సూర్యభగవానుడు రావాలి. కళ్ళు కనిపించాలి. అంతవరకు అవి తెరచివున్నా మూసివున్నా ఒకటే అనిపించింది.

వనమహోత్సవాల కోసం మనం తాపత్రయపడుతుంటే ఆయన వనసంహారం చేసి చక్కాపోయాడు. అధిక పంటలకోసం మనం తంటాలు పడుతుంటే పండిన ధాన్యాన్ని పంచబంగాళం చేశాడాయన. మానవుడెంత ? మానవుని శక్తి ఎంతవరకూ? పంచభూతాలూ, ఆ పైన భగవంతుడు అనుగ్రహించినంతవరకే.

"నవంబరు ఏడవ తేదీ రాత్రి నా జన్మలో మరిచిపోను" అనడమే ప్రతివారు. ఒక మాదిరి పాకలన్నీ వూగిపోయాయి. ఇకవాటిలో వుండేవారి మనస్సులెలా వూగాయో? ఎలా చెప్పడం?

ఒకరు చిన్నపాకలో వున్నారు. ఇల్లు వూగడం ప్రారంభించింది. అంతా భయపడ్డారు. ఇంతలో ఒక ప్రక్క ఇల్లు అంటుకుని రవ్వలు రావడం ప్రారంభించాయి. ఒక ప్రక్క ఉధృతంగా గాలి, అందులో అగ్గి మంటలు. అగ్గిముద్దలు గాలిదేవుడు తెచ్చి ఎన్ని ఇళ్ళమీద వేసిపోతున్నాడు.

పైన చెప్పిన గృహస్తు భార్యాపిల్లల్ని ఎదురుగావున్న డాబా యింటికి వెళ్ళమంటాడు. పిల్లల్ని కాపాడమంటాడు. 'మీరు రాందే వెళ్ళ'నంటుందా ఇల్లాలు. ఆయన 'వంశాన్ని నిలపవే' అంటాడు. ఆవిడ 'నా మంగళసూత్రం కాపాడండి, మీరుకూడా' అని బ్రతిమాలుతుంది.

చివరకు ఆయన ఇంట్లో వుండి భార్యను పిల్లల్ని ఎదురింటికి పంపాడు. తాను పోతాననుకుని కాపలా కాస్తూ వుండిపోయాడు. ఇంట్లో ఎదురింటికి వెళ్ళిందే గాని ఆ ఇల్లాలు భర్తను తలుచుకుని అక్కడ బిగుసుకుపోయింది. ఆ ఇంటినుంచి ఈ యింటికి వార్తలేదు. ఎవరికి సాధ్యం వెళ్ళి చెప్పటానికి? బయటికి వస్తే ఆ చీకటి ముద్దలో చుట్టుకుని ఎక్కడికి కొట్టుకుపోతారో తెలియదు మరి. ఇలా ఎందరు భీతావహులై మతిచెడి ఆ రాత్రి గడిపారో చెప్పలేం.

ఒకరింటి కిటికీకి అద్దాలున్నాయట. ఎక్కడినుంచో ఇనప గిర్డరు వచ్చి ఆ అద్దాలకు కొట్టుకోవడంతో అది ముక్కముక్కలై ఇంట్లో వారి వంట్లోకి చొచ్చుకుపోయాయని చెప్పుకున్నారు.

ఒకరింట్లో సీలింగ్ ఫాన్ వూడి వెళ్ళి ఎక్కడో పడిందిట. తెల్లవారిన తర్వాత ఇలాంటి కథలెన్నో చెప్పుకున్నారు. అర్ధరాత్రి తర్వాత "చేసిన అఘాయిత్యం చాలు"నన్నట్లు గాలిదేవుడు ఎక్కడికో దూసుకుపోయాడు. రాత్రి ఇంతగందరగోళం జరిగిందన్న సంగతి తనకేమీ తెలియనట్లు సూర్యభగవానుడు వెలుగు శాలువ కప్పుకొని విను వీధిలో ప్రత్యక్షమయ్యాడు. ప్రజలకు ఎంతో ధైర్యం వచ్చింది.

రాత్రంతా ప్రాణాలు ఎలా నిలుస్తాయా అన్న భయంతో ఒణికిపోయిన జీవులు తెల్లవారేటప్పటికి మళ్ళీ ఈ ప్రాణాల్ని ఎలా నిలబెట్టుకోవడమా అ తాపత్రయంలో పడ్డారు.

"భోగి పండగ. ఏదో అలాగే తలంట్లు పోయాలి నలుగురికీ" అంటూ గృహిణులు కాగులు వెతుక్కున్నారు.

వాయుదేవుడు రాత్రంతా ప్రకృతికి తలంటి చక్కా పోయాడు. "చిక్కు నువ్వే తీసుకో" అన్నట్లు. ప్రకృతికి "భోగి" తలంటి పోశానని ఆయన మురిసిపోయాడు గావున్ను. అభిజిత్యానికి మానవుల 'జోడి' మసగబారిపోయింది. తలంట్లు పకపకలే లేవు. నూతన వస్త్రాల సందడులే తక్కువ.

అంతకుముందే కొనుక్కొచ్చిన వాళ్ళు పిల్లలకు తొడిగి "బయటికి వెళ్ళొద్దు. పదినిమిషాలు వుంచుకుని విప్పెయ్యమ"ని ఆదేశించారు. మంచి ఖరీదు బట్టలు కొనుక్కున్న మా బావమరిదిగారి వంటివాళ్ళు మర్నాడు సాయంత్రం వాటిని ధరించి చిన్న చిన్న షికార్లు చెయ్యడం ప్రారంభించారు.

తెల్లవారినప్పటి నుంచీ వ్యాపారాలు మళ్ళీ ప్రారంభమైనాయి. నేను తలుపు తీసి బయటికి రాగానే "చామంతి పువ్వులు, మల్లెపువ్వులు" అంటూ కేక వినిపించింది. "ఎంత ప్రళయం వచ్చినా భగవంతుని పూజకు అంతరాయం రాదు. అందులో శనివారం ఉదయమే పువ్వులు వచ్చాయి" అని పిలిచాను.

పూలదండలు ఎంతో చక్కగా వున్నాయి. అప్పుడే కోసినట్లుగా స్వచ్ఛంగా వున్నాయి. "రాత్రంతా వానగదా పాకలు ప్రాణాలు వూగినాయి కదా! ఎప్పుడు కట్టారీ మాలలు?" అని ప్రశ్నించాను.

"నిన్న సాయంత్రమే కట్టాం సార్. బయటికి రాలేక దాచేశాం. రాత్రి వానకూ, చల్లదనానికీ అలా వున్నాయి వాడకుండా" అని పువ్వులదండి కొలిచి ఇచ్చాడు.

"కొలత చూసుకోండి" అన్నాడు.

"నీ కొలత కేమిలే వీటితో మేము స్వామిని కొలవడంలో వుంది అసలు శక్తి" అని దండ తీసుకుని వెళ్ళాను లోపలికి. స్నానం చేసి స్వామి మంటపం విగ్రహం ఆ నవ్వే పువ్వుల మాలలతో అలరించాను. ఆ స్వామి అభయమిచ్చినట్లుగా చూశాడు. అక్కడితో మళ్ళీ సంసార సమరం ప్రారంభం.

ఇంతలో ఉప్పుబండి వచ్చింది. 'ఉప్పు' కేకలు వినిపించాయి జిహ్వాచాపల్యపు దినుసులు మళ్ళీ చెవిని పడడం మనసులో ప్రవేశించడం తాపత్రయ దావాగ్నులలో చిక్కుకోవడం సంభవించింది.

ఆ ఒకరోజు మాత్రం తుఫాను భీభత్సవానికి చెందిన వార్తలు ఎడతెరిపి లేకుండా చెప్పుకున్నాను. ఎవరి గాథ వారు చెపుతుంటే యెంతో జాలిగావుంది. "గాలి దేవుడు ఇంతపని చేస్తాడు అనుకోలేదు" అని ప్రతివారూ విస్తుపోవడమే.

"ఏవయ్యా వరుణదేవా! ఎందుకయ్యా నరులమీద నీకు అంత క్రోధం దీనివల్ల నీ శక్తిని ప్రదర్శించడం తప్ప వేరేం ప్రయోజనం సాధించావు?"

పత్రికలలో నీ ప్రతిభను గురించి వ్యాసాలు వ్రాయించుకోవాలనే ఆకాంక్ష ఎక్కువైందిలే మహానాయకులకు మల్లేనే.

Post your comments